క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



ధరూరు: మండల పరిధిలోని మార్లబీడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రోశన్న సోదరుడు లక్ష్మన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ సీసల్ వెంకట్‌రెడ్డి, పటేల్ శ్రీనివాసులు బుధవారం వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గాళ్ల సురేష్, ఆనంద్‌గౌడ్, ఏసన్న, ప్రభాకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



కేటీదొడ్డి: రైతులు నానో యూరియా వాడకం వైపు మళ్లించడమే లక్ష్యంగా మండలంలోని చింతలకుంట గ్రామంలోని రైతువేదికలో ఏఈఓ భరత్‌సింహ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నానో యూరియా వాడకం వల్ల పొందే ప్రయోజనాలు వివరించారు. సాధారణ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ పరిమాణంలో అధిక ఫలితాలు ఇస్తుందని సూచించారు. తక్కువ ధర.. ఎక్కువ ప్రయోజనం. జీవవైవిధ్యం పునరుత్తేజానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల అరెస్ట్ సరికాదు



అయిజ: పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ సందర్శనకు వెళ్తున్న రాష్ట్ర పౌర హక్కుల సంఘం నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని పౌర హక్కుల సంఘం నాయకుడు విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేస్తామని హామీ ఇచ్చి తిరిగి పనులు ప్రారంభించడంతో 12 గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారన్నారు. ఆవేదనలో చేసిన పనికి పోలీసులు రైతులను జైలుకు పంపారని వాపోయారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాములు, టీడీపీ నాయకుడు సుధాకర్‌గౌడ్, ప్రజాసంఘాల నాయకుడు కృష్ణ. పౌరహక్కుల సంఘం నాయకుడు ఆంజనేయులు, కర్రెప్ప, దేవదానం, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌ఆర్మీ ఇన్‌చార్జ్‌కు సన్మానం



అయిజ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భీమ్ ఆర్మీ ఇన్‌చార్జ్‌గా ఎంపికైన మాచర్ల ప్రకాష్‌ను మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులు బుధవారం శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అశోక్, మోజేష్, ప్రసాద్, మార్క్, మత్తాలి, ప్రసాద్, రవి, ప్రకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి



అయిజ: ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అయిజ ఎంఈఓ రాములకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మాధవ్, మహేష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యమేది?

- పంచాయతీల్లో నామమాత్రంగానే గ్రామసభలు
- అవగాహన కల్పించని అధికారులు



పల్లెపాడులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

మానవపాడు:సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి నెలల గడుస్తున్నా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని గాలికొదిలేశారు. గ్రామాల్లో గ్రామసభ నిర్వహణ తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రజా సమస్యలు సభలో చర్చించి,సమస్యల పరిష్కారం కోసం అధికారులు,ప్రజా ప్రతినిధులు కృషి చేపట్టే గ్రామసభలు పేరుకే నిర్వహించి సంతకాలు పెట్టుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సభల నిర్వహణ కీలకం..

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు గ్రామసభల్లో పాల్గొని సమస్యలు గుర్తించి వాటి పరిష్కరం కోసం చర్చిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల నమోదు వివరాలను గ్రామసభల ద్వారా నిర్వహిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గ్రామసభలు మండలంలో నామమాత్రంగానే సాగుతున్నాయి. ప్రజల భాగస్వామ్యాన్ని తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహిస్తుండటంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్వహణ తీరు

గ్రామ పంచాయతీల్లో సభ నిర్వహించే తేదీని ఒకరోజు ముందగానే గ్రామస్తులకు తెలియజేయాలి. పంచాయతీతోపాటు అనుబంధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించే తేదీని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖల అధికారులు, జనాభాలో సుమారు 20 శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. రెండు నెలలకో సారి, సర్పంచ్‌లు, ప్రత్యేక అధికారులు పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించాలి. కనీసం 50 మందితో గ్రామసభను నిర్వహించవచ్చు. కోరం లేని పక్షంలో సభ వాయిదా వేయవచ్చు. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలను నమోదు చేసుకోని వాటి పరిష్కరం కోసం కృషి చేయాలి. అభివృద్ధి పనులు, కార్యాచరణపై చర్చ జరుగుతుంది. పంచాయతీల ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపిస్తారు.

దూరంగా ప్రజలు...

మండలంలోని చాలా గ్రామాలలో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది మంది గ్రామస్తులు కూడా హాజరవడం లేదు. ప్రజాప్రతినిధులు, మాజీలు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు, నాయకులకు సమాచారం ఉండటం లేదు. సమస్యలు పేరుకుపోవడం వలన సభలకు ఆదరణ తగ్గి ప్రజలు రావడం లేదు.

సమస్యలు గాలికొదిలేశారు

గ్రామసభలో ప్రస్తావించిన సమస్యలను అధికారులు గాలికొదిలేస్తున్నారు. గ్రామసభ ద్వారా గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి. గ్రామసభలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సమాచారం లేక ప్రజలు గ్రామసభలకు దూరంగా ఉంటున్నారు.

– సంపత్‌కుమార్‌రెడ్డి, చెన్నిపాడు

సంతకాలు పూర్తయితే చాలు

గ్రామసభలకు వార్డు మెంబర్లు, అధికారులు వెళ్లి సంతకాలు పూర్తయితే చాలు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామసభల సమస్యలు చర్చించి వాటిని పరిష్కార మార్గం చూపాలి. పేరుకు మాత్రమే గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

– నారాయణరెడ్డి, మానవపాడు

భాగస్వామ్యం పెరగాలి

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులు టాంటాం(దండోరా) వేయించేలా చర్యలు తీసుకుంటాం. గ్రామసభల ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోని వాటిని పరిష్కరించేందుకు వీలుంటుంది.

- భాస్కర్, ఎంపీడీఓ, మానవపాడు

సత్వరమే దరఖాస్తుల పరిష్కారం



లిగనవాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

అలంపూర్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ మంజుల అన్నారు. మండలంలోని లింగనవాయి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. వివిధ రకాల భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు రైతులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ సీనియర్ సహాయకులు సుచిత్ర, అంజనేయులు, ఆర్‌ఐలు దుర్గా సింగ్, మాసుం బాష తదితరులు పాల్గొన్నారు.

20 దరఖాస్తులు అందజేత

గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించారు. తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 20 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

కేటీదొడ్డి: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసకోవాలని తహసీల్దార్ హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలోని నిర్వహించిన సదస్సుల్లో 8, వెంకటాపురంలో 6 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ధరూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ అలివేలు మంగమ్మ, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్ఐ తేజ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ధరూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ఉండవెల్లి: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికరమైన ఆహారం అందించాలన్నారు. అదే విధంగా పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పరిమళ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుచితో పాటు నాణ్యతగా ఉండాలి

ధరూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచితోపాటు నాణ్యతగా ఉండాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలి

గట్టు: అంగన్‌వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసిన చిన్నారులు తప్పని సరిగా ప్రాథమిక పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ నల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మల చెర్వు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించి పుస్తకాలు, యూనిఫాంల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తుమ్మలచెర్వులో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంఈఓ నల్లారెడ్డి



కలుగోట్ల కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ రామకృష్ణ

ఫీజు బకాయిలు చెల్లించాలి

గద్వాలటౌన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ గంజిపేట పరుశురాం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో దళిత, గిరిజన, పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడానికి ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు నీరుగారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండేళ్లుగా సుమారు రూ.154 కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏసన్న, వినోద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గడువు రెండు రోజులే..

అలంపూర్: పొలాల పాసుబుక్‌లు నూతనంగా మంజూరైన రైతులు ఈ నెల 20వ తేదీలోపు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని అలంపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి నాగార్జున్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరధిలో వానకాలం పంట సాగు చేసిన 10,349 మంది రైతులకు రూ.16,21,37,593 నిధులు మంజూరవగా, 3 ఎకరాల వరకు పొలం ఉన్న 6,816 మంది రైతులకు రూ.6,10,45,148 వారి ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు గ్రామ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పొగాకు కొనుగోళ్లు చేపట్టాలి



గట్టు: పొగాకు బేళ్లను తక్షణమే రైతుల నుంచి కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మిట్టదొడ్డి ఆశ్రమం వద్ద ఉన్న పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. మిట్టదొడ్డి, చాగదోన, చిన్నోనిపల్లె గ్రామాలకు చెందిన సుమారు 80 రైతులకు చెందిన సుమారు 1,100 పొగాకు బేళ్లను కంపెనీ సిబ్బంది రెండు నెలలుగా కొనుగోలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పొగాకు కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యల్లందొడ్డి రాజు నాయుడు, మద్దిలేటి, రాజు, రాముడు, ఈరన్న, ఉరుకుంద, నర్సింహులు, గోవిందు, వినోద్, రైతులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల పరిశీలన

మానవపాడు: మండలంలోని బోరవెల్లి గ్రామంలో బుధవారం జేఎస్‌జేబీ కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ సత్యనారాయణమూర్తి, జిల్లా డీఆర్పీ విధ్యాదర్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంకుడు గుంతలు మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ చెన్నకేశవులు, పంచాయతీ సెక్రటరీ అరుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు

అలంపూర్: ప్రతి ఒక్కరూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నోడల్ పర్సన్ బాలిశ్వరయ్య శెట్టి సూచించారు. మున్సిపాలిటీలోని సంతోష్‌నగర్, సంతమార్కెట్ కాలనీలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ పర్సన్ బాలిశ్వరయ్యశెట్టి, శానిటేషన్ అధికారి మద్దిలేటి పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో పలు కాలనీల్లో పర్యటించారు. నివాస గృహాల మధ్య మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగులో దోమలు వృద్ధి చెందడంతో పాటు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి రోగాలు ప్రబలుతాయన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. కలరా, వాంతులు, విరోచనాలు రాకుండా నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేకిన్ ఇండియాతో ప్రపంచ గుర్తింపు



అయిజలో మాట్లాడుతున్న నరసింహులు

గట్టు: ప్రధాని మోదీ ప్రభుత్వం మేకిన్ ఇండియాతో ప్రపంచ గుర్తింపు సాధించినట్లు బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా విజయసంకల్ప కార్యక్రమాన్ని మండల పరిధిలోని చాగదోన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, ఆయుష్మాన్ భారత్, ఆపరేషన్ సింధూర్, విశ్వకర్మయోజన వంటి పథకాలతో అందరి దృష్టిని ఆకర్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్ప, ఓబీసీ అధ్యక్షుడు మొద్దు సంజీవనాయుడు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, బీజేవైఎం అధ్యక్షుడు వీరశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి

అయిజ: ప్రధాని నరేంద్రమోదీతో పాలనలో దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వంలో చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గిడ్డన్న, మహేష్, గోపాల్, నరసిహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక కార్యక్రమం ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండంలోని వివిధ పాఠశాలలకు చెందిన 50 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 9 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు సురేష్ తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు జితేందర్, రజనీకాంత్, ఆనంద్, సుహాసిని, రత్నమాల, విజయ్, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



తక్కశీలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ఇటిక్యాలలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇటిక్యాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీహెచ్‌ఓ డాక్టర్ అబ్దుల్ వాసే అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నెల నెల నిర్వహిస్తున్న ఫాలో, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అబ్‌నార్మల్‌గా ఉన్న వారిని జిల్లా ఎన్సీడీ క్లినిక్‌కు పంపించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగాం అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి, మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక, ఎన్‌సీడీ సమన్వయ కార్యకర్త శ్యాం సుందర్, డబ్ల్యూహెచ్‌ఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఉండవెల్లి: మండలంలోని తక్కశీలలో సీజనల్ వ్యాధులపై క్యాతూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పల్లెదవాఖానాలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉలిగమ్మ, ఏఎన్‌ఎంలు నర్సమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టరా ?



నాగర్‌దొడ్డిస్టేజీ వద్ద ప్రమాదకంగా రోడ్డుపై ఉన్న గుంత

మల్దకల్: అయిజ- గద్వాల ప్రధాన రహదారిలోని నాగర్‌దొడ్డిస్టేజీ సమీపంలో కాల్వ నిర్మాణం కోసం రోడ్డును తవ్వడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై రెండు చోట్ల తవ్విన గుంతలకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వాలు



ఇటిక్యాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని శనగపల్లి గ్రామంలో పార్టీ బూత్ స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పూలే, అంబేడ్కర్ మహనీయుల ఆశయాలు కేవలం బీఎస్పీ ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. వెంకట్‌రాముడు, రామాంజనేయులుగౌడ్, ఈశ్వర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి

మానవపాడు: మండల కేంద్రంలోని నర్సరీలను బుధవారం డీఆర్డీఓ నర్సింగరావు పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లోని మొక్కలను వనమహోత్సవ కార్యక్రమాలకు సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కలు ఎండకుండా నీటిసదుపాయం కల్పించాలని వన సంరక్షకులకు సూచించారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

